సాక్షి
రాజన్న సిరిసిల్ల

శనివారం । 7 । జనవరి । 2023



సర్టిఫికెట్లు అందజేత

వేములవాడఅర్బన్: రుద్రవరంలో అనిత ప్రగతిపథం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్ శిక్షణ పొందిన వారికి శుక్రవారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.



ఆధ్యాత్మికం వెల్లివిరియాలి

వేములవాడ: శివదీక్షాపరులతో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి పేర్కొన్నారు. స్వాములకు అన్నదానం చేసే సత్రాన్ని శుక్రవారం ప్రారంభించారు.

గరిష్టం/కనిష్టం
28.0/16.0

వాతావరణం

వాతావరణం పొడిగా, ఉక్కపోతగా ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు



సమావేశంలో మాట్లాడుతున్న భూంరెడ్డి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రైతులు వరి పంటకు ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ పంటలను సాగుచేసి అధిక లాభాలు పొందాలని మండల వ్యవసాయాధికారి భూంరెడ్డి కోరారు. రాచర్ల గొల్లపల్లిలో శుక్రవారం రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించారు. అన్నదాతలు మార్కెట్‌లో ఎక్కువ డిమాండ్ ఉన్న పంటలను సాగుచేసి ఆర్థికంగా ఎదగాలన్నారు. ఆయిల్ పామ్ సాగుచేస్తే ఎకరాకు రూ.లక్ష వరకు లాభాలను పొందవచ్చన్నారు. సర్పంచ్ పాశం సరోజన, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి, ఏఈవో ముకుంద్ కుమార్ పాల్గొన్నారు.

పోలీస్ అభ్యర్థులకు న్యాయం చేయాలి



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న అరుణ్‌కుమార్

సిరిసిల్లఅర్బన్/సిరిసిల్లటౌన్: పోలీసు అభ్యర్థులకు న్యాయం చేయాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సిరిసిల్లలోని సీఐటీయూ ఆఫీస్‌లో శుక్రవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడారు. ఎస్సై, కానిస్టేబుల్ నియామక దేహదారుఢ్య పరీక్షలలో అవకతవకలు ఉన్నాయని, తప్పులను సవరించాలని కోరారు. అభ్యర్థులకు పాత పద్ధతిలోనే ఈవెంట్స్ నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలన్నారు. కొత్తగా తీసుకొచ్చిన నిబంధనలతో లక్షల మంది అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించలేకపోతున్నారన్నారు. డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు గాంతుల మహేశ్, సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేశ్, బీఎస్పీ నాయకులు మధుకర్, ఐద్వా జిల్లా కార్యదర్శి విమల, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రాకేశ్, ఏఐఎస్‌ఎఫ్ రంజిత్, భీమ్ ఆర్మీ నాయకులు ప్రవీణ్, సాయికుమార్, శివ ప్రశాంత్ ఉన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మల్లేశం, సురేశ్ పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

సిరిసిల్లటౌన్: కనీస వేతనం అమలు చేసేలా యాజమాన్యాలను ఆదేశించాలని కోరుతూ సైజింగ్ కార్మికులు శుక్రవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో జీవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యాలతో జరిగిన చర్చలలో న్యాయం దక్కలేదన్నారు. ఇప్పటికైనా కనీస వేతన చట్టం అమలు చేయాలని కోరారు. కిశోర్, రాము, సతీశ్, అంజయ్య, యూసుఫ్ ఉన్నారు.

పత్తాలేని పునరావాసం

ఉపాధి



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ బుగ్గ రాజేశ్వరతండాకు చెందిన అజ్మీరా గోరవ్వ. ఆమె భర్త మోతిలాల్ అనారోగ్యంతో మరణించాడు. నాటుసారా తయారు చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేది. రెండు సార్లు నాటుసారా అమ్ముతుండగా అధికారులు పట్టుకున్నారు. కేసులతో ఇబ్బందులు ఎదుర్కొంది. ఈ క్రమంలోనే ప్రభుత్వం పునరావాస పథకం కింద రూ.2 లక్షలు అందజేయడంతో పాడిగేదెలను కొని ఉపాధి పొందుతుంది. ఇలా జిల్లాలో 56 కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి.

జరిమానా



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ ఎల్లారెడ్డిపేట మండలంలోని పోచమ్మతండాకు చెందిన భూక్య రాజవ్వ. గుడుంబా అమ్ముతూ కేసుల పాలుకాగా ఆమెను ఎక్సైజ్ అధికారులు గతేడాది మే నెలలో అరెస్టు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ప్రభుత్వం పునరావాస పథకాన్ని నిలిపివేయడంతో ఉపాధి లేక మళ్లీ నాటుసారా విక్రయాలపై దృష్టి సారించింది. దీంతో గతేడాది ఆగస్టు 2న గుడుంబా అమ్ముతుండగా పట్టుకుని కోర్టులో హాజరుపరిచారు. బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించినందుకు రూ.లక్ష జరిమానా చెల్లించింది. వారంపాటు జైలు జీవితం అనుభవించింది. ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయంతో ఉపాధి పొందిన వారు తమ జీవితాలను బాగుచేసుకోగా.. పథకం నిలిచిపోవడంతో చాలా మంది భూక్య రాజవ్వ మాదిరిగా జైలు పాలవుతున్నారు.

- మళ్లీ గుడుంబా వైపు గిరిజనుల అడుగులు
- కేసులపాలవుతున్న పల్లెజనం
- ఏడాదికే పరిమితమైన పథకం
- పునరావాసం కింద రూ.1.12 కోట్లు పంపిణీ
- 56 కుటుంబాలకే పరిమితమైన ఉపాధి



బెల్లం పానకాన్ని పారబోస్తున్న అధికారులు

జిల్లాలో కేసుల వివరాలు..

సంవత్సరం	2018	2019	2020	2021	2022
కేసులు	23	15	25	116	169

ఏడేళ్లలో పట్టుకున్న నాటుసారా : 3,492 లీటర్లు | బెల్లం పానకం : 38,700 లీటర్లు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాష్ట్రాన్ని గుడుంబా రహితంగా మార్చాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల ఉపాధి కోసం ప్రవేశపెట్టిన పునరావాస పథకం పత్తాలేకుండా పోయింది. 2016 నుంచి 2017 వరకు ఏడాదిపాటు పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలుచేసిన ప్రభుత్వం తర్వాత నిలిపివేసింది. గత ఏడేళ్లుగా జిల్లాలో గుడుంబా కేసులు పెరుగుతూనే ఉన్నాయి. 2016 నుంచి 2017 వరకు జిల్లాలోని 56 కుటుంబాలకు ఉపాధి కల్పనకు రూ.1.12 కోట్లు మంజూరు చేశారు. ఒక్కో కుటుంబానికి వంద శాతం సబ్సిడీపై రూ.2లక్షల చొప్పున అందజేసింది. లబ్ధి పొందిన కుటుంబాలు ఆటోలు, టెంట్‌హౌస్‌లు, గేదెలు, గొర్రెల పెంపకం, బ్యాంగిల్‌స్టోర్స్ వంటి వాటిని ఏర్పాటు చేసుకొని జీవనోపాధి పొందుతున్నాయి. తర్వాత ఏడాది నుంచి ఆ పథకాన్ని కొనసాగించకపోవడంతో గిరిజనులు మళ్లీ గుడుంబా తయారీ వైపు వెళ్తున్నారు.

ఏడేళ్లలో 348 మందిపై కేసులు

ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన పునరావాస పథకాన్ని ప్రభుత్వం 2016–2017 సంవత్సరానికి మాత్రమే పరిమితం చేయడంతో తర్వాత సంవత్సరం నుంచి గిరిజనులు గుడుంబా తయారీ, విక్రయాల వైపు మళ్లారు. గత ఏడేళ్లలో పోలీసులు, ఎక్సైజ్ అధికారులు గుడుంబా విక్రయిస్తున్న 348 మందిపై కేసులు నమోదు చేశారు.

పథకం నిలిపివేతతో ఉపాధి కరువు

జిల్లాలోని ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, గంభీరావుపేట, ముస్తాబాద్, కోనరావుపేట, చందుర్తి, రుద్రంగి, వేములవాడరూరల్, ఇల్లంతకుంట మండలాల్లో ప్రధానంగా గిరిజనులు, గిరిజనేతరులు నాటుసారాను విక్రయించి జీవనోపాధి పొందుతుంటారు. 2016–2017లో ప్రభుత్వం తీసుకొచ్చిన గుడుంబా బాధితుల పునరావాస పథకం (జీఈటీఆర్‌ఎస్)ను కొనసాగించి ఉంటే మళ్లీ పల్లెల్లో గుడుంబా కంపు ఉండకపోవు. పునరావాస పథకాన్ని కొనసాగించకపోవడంతో మళ్లీ సారా తయారీ, విక్రయాలనే ఉపాధిగా ఎంచుకున్న గిరిజనులు కేసుల పాలవుతున్నారు. 2022లోనే 42 మందిని అరెస్టు చేయగా అందులో ముగ్గురికి జైలు, 39 మంది నుంచి రూ.లక్ష చొప్పున రూ.39 లక్షలు ప్రభుత్వానికి జరిమానా చెల్లించారు. ఒకసారి నేరం చేసి బైండోవర్ అయిన వారు తిరిగి నేరం చేస్తూ జైలు జీవితం గడుపుతున్నారు. బైండోవర్ల నిబంధనలను ప్రభుత్వం కఠినతరం చేయడంతో జైలు జీవితం, జరిమానాలు చెల్లిస్తూ గిరిజనులు అప్పుల పాలవుతున్నారు.

56 కుటుంబాలలో వెలుగులు

ఏడాది పాటు ప్రభుత్వం నుంచి ఆర్థిక లబ్ధి పొందిన 56 కుటుంబాల జీవితాల్లో వెలుగులు నిండాయి. సారా తయారీకి స్వస్తి చెప్పి గేదెలు, గొర్రెలు, ఇతరత్ర పనులతో ఉపాధి పొందుతూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి పథకాన్ని కొనసాగించాలని జిల్లా గిరిజన, గిరిజనేతరులు కోరుతున్నారు.

అప్పుల పాలు



ప్రభుత్వం నుంచి ఉపాధి లేక నాటుసారా తయారు చేసి అమ్ముతూ పట్టుబడ్డా. మొదటి సారి బైండోవర్ చేసి వదిలిపెట్టారు. ఆ సమయంలో వ్యక్తిగత పూచీకత్తు, షరతులతో విడిచిపెట్టారు. ఇతరత్ర ఉపాధి లేకపోగా, పునరావాస పథకం నిలిపివేయడంతో తిరిగి గుడుంబాను విక్రయిస్తూ మరోసారి పట్టుబడితే జైలుకు పంపారు. జైలు నుంచి విడుదలయ్యేందుకు అప్పులు చేసి రూ.లక్ష జరిమానా చెల్లించిన. ఈ పథకాన్ని తిరిగి కొనసాగించాలి.

– బానోతు రమేశ్, గుండారం

ఉపాధి లేకనే సారా తయారీ



గిరిజనుల ఉపాధి కోసం ప్రభుత్వం జీఈటీఆర్‌ఎస్ పథకాన్ని ప్రవేశపెట్టింది. జిల్లావ్యాప్తంగా 56 కుటుంబాలకు ఆర్థిక లబ్ధి చేకూరింది. వారంతా ప్రస్తుతం గుడుంబా అమ్మకాలకు దూరంగా ఉంటున్నారు. పథకం నిలిపివేతతో ఉపాధి లేక కొందరు మళ్లీ సారా తయారీ చేస్తున్నారు. దాడులు చేస్తున్నప్పటికీ పూర్తి స్థాయిలో అరికట్టలేకపోతున్నాం. మళ్లీ ప్రభుత్వం ఈ పథకాన్ని కొనసాగించే ఆలోచనలో ఉంది.

– ఎంపీఆర్ చంద్రశేఖర్, ఎక్సైజ్ సీఐ, ఎల్లారెడ్డిపేట

కలుషిత నీటితో విద్యార్థులకు అస్వస్థత



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు



విద్యార్థుల పరిస్థితి తెలుసుకుంటున్న ఆగయ్య

- సిరిసిల్ల ఆస్పత్రికి 29 మంది తరలింపు
- 25 మంది డిశ్చార్జ్.. నలుగురికి ప్రత్యేక వైద్యం
- ఆందోళనలో తల్లిదండ్రులు
- సంఘటనపై మంత్రి కేటీఆర్ ఆరా



విద్యార్థులను పరామర్శిస్తున్న జెడ్పీటీసీ లక్ష్మణ్‌రావు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల)/సిరిసిల్ల టౌన్: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 29 మంది శుక్రవారం అస్వస్థతకు గురయ్యారు. కలుషిత నీటితో చేసిన భోజనం తినడ మే ప్రధాన కారణంగా తెలుస్తోంది. వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురికాగా సమాచారం అందుకున్న తహసీల్దార్ జయంత్‌కుమార్ స్థానిక వైద్యసిబ్బందిని అప్రమత్తం చేసి ప్రథమ చికిత్స అనంతరం ప్రత్యేక అంబులెన్స్‌లో సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. పాఠశాలలో మొత్తం 95 మంది విద్యార్థులు చదువుకుంటుండగా అందులో 29 మంది అస్వస్థతకు గురయ్యారు. వారిలో నలుగురు విద్యార్థులు శరవున్ లిల్లి, బి.దివ్య, డి.శ్రీజ, గనగోని శ్రీనివాని తీవ్ర అస్వస్థతకు గురికాగా వారికి వైద్యులు వైద్యం అందిస్తున్నారు. ఈ సంఘటనపై తల్లిదండ్రులు పాఠశాల ముందు నిరసన తెలిపారు.

సంపులో నింపిన నీటితో వంటలు

పాఠశాలలో మన ఊరు–మన బడిలో భాగంగా నీటిసంపుతోపాటు ఇతర అభివృద్ధి పనులు చేస్తున్నారు. మధ్యాహ్న భోజనం తయారీ రోజూ భగీరథ నీటితోపాటు ఫిల్టర్‌వాటర్‌ను ఉపయోగిస్తారు. రెండు రోజులుగా భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో స్కూల్‌కు ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. కొత్తగా నిర్మించిన సంపులో శుక్రవారం ఉదయం ట్యాంకర్ ద్వారా నీటిని నింపారు. సంపులో నింపిన నీటితోనే నిర్వాహకులు మధ్యాహ్న భోజనాన్ని తయారు చేశారు. ఆ భోజనం తిన్న 29 మంది విద్యార్థులకు వాంతులు, విరేచనాలు అయ్యాయి. ప్రధానోపాధ్యాయుడు పాపయ్య, విద్యార్థుల పరిస్థితిపై స్థానిక వైద్యాధికారులకు, తహసీల్దార్‌కు సమాచారం అందించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విద్యార్థులను సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. 25 మంది ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండగా, నలుగురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వైద్యులు వారికి మెరుగైన వైద్యం అందిస్తున్నారు. విద్యార్థులకు ఎలాంటి ప్రాణాపాయం లేదని జిల్లా వైద్యాధికారి సుమన్ మోహన్‌రావు తెలిపారు. 25 మందికి వైద్యం అందించి ప్రత్యేక వాహనంలో ఇంటికి పంపించినట్లు తెలిపారు. మంత్రి కేటీఆర్ జిల్లా విద్యాధికారి, డీఎంహెచ్‌వోతో మాట్లాడారు. ఈ సంఘటనపై పూర్తి వివరాలు తెలుసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన వైద్యం అందించాలని డీఎంహెచ్‌వోకు సూచించారు.

వైద్యుల పర్యవేక్షణలో నలుగురు

తీవ్ర అస్వస్థతకు గురైన నలుగురు విద్యార్థులకు జిల్లా వైద్యాధికారి పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నలుగురు విద్యార్థులను జిల్లా విద్యాధికారి రాధాకిషన్, తహసీల్దార్ జయంత్‌కుమార్, ఎంఈవో రఘుపతి, జెడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ఎస్సై శేఖర్ పరామర్శించారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య హుటాహుటిన ఆస్పత్రికి చేరుకుని విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఆస్పత్రి ముందు ఏబీవీపీ నాయకులు ధర్నా చేయగా పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

సిరిసిల్ల కోర్టుకు జనశక్తి నేత కూర రాజన్న

- మళ్లీ 17, 20 తేదీల్లో విచారణకు ఆదేశాలు



సిరిసిల్ల కోర్టుకు హాజరైన కూర రాజన్న

సిరిసిల్ల: సీపీఐ(ఎంఎల్) జనశక్తి అగ్రనేత కూర రాజన్న అలియాస్ రాజేందర్ అలియాస్ కేఆర్‌ను పోలీసులు సిరిసిల్ల జిల్లా కోర్టులో శుక్రవారం హాజరుపరిచారు. హైదరాబాద్ చంచల్‌గూడ జైలులో ఉన్న రాజన్నను సిరిసిల్ల కోర్టుకు భారీ పోలీస్ ఎస్కార్ట్ వ్యాన్‌లో తెచ్చారు. జిల్లాలోని తంగళ్లపల్లి మండలం చింతలఠాణా శివారులో 2012లో నాలుగు 8 ఎం.ఎం. పిస్టల్స్, 50 బుల్లెట్లు కలిగి ఉన్నట్లు రాజన్నపై అప్పట్లో కేసు నమోదైంది. ఈ కేసులో జనవరి 17న మళ్లీ కోర్టు విచారణకు రాజన్నను హాజరుపరచాలని జిల్లా జడ్జి ప్రేమలత ఆదేశించారు. కోనరావుపేట మండలం సుద్దాల మాజీ సర్పంచ్ ఏనుగు వేణుగోపాల్‌రావు అలియాస్ ప్రభాకర్‌రావును 2013లో హత్యచేసిన కేసులో కూర రాజన్న నిందితుడుగా ఉన్నారు. ఈ కేసు విచారణను ఈనెల 20కి వాయిదా వేశారు. ఈ రెండు కేసుల విచారణ వాయిదా పడడంతో రాజన్నను మళ్లీ చంచల్‌గూడ జైలుకు తరలించారు. రాజకీయ ఖైదీలను రాజ్యం అక్రమ కేసులు నమోదు చేసి వేధిస్తోందని, భేషరతుగా వారిని విడుదల చేయాలని ఈ సందర్భంగా కూర రాజన్న కోరారు.

నంబర్‌ప్లేట్స్ లేని వాహనాల పట్టివేత



తనిఖీలు చేస్తున్న సీఐ వెంకటేశ్

వేములవాడ: నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై వేములవాడ టౌన్ పోలీసులు శుక్రవారం కొరడా ఝులిపించారు. ఇటీవల 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఎస్పీ రాహుల్‌హెగ్డే ప్రతి రోజు వేములవాడలో వాహన తనిఖీలు చేపట్టాలని సీఐ వెంకటేశ్‌ను ఆదేశించారు. దీంతో పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద నంబర్‌ప్లేట్ లేని వాహనాలను పట్టుకుని పత్రాలు పరిశీలించారు.

భూముల సమస్యలు పరిష్కరిస్తాం



గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో రెవెన్యూ, భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ జయంత్‌కుమార్ పేర్కొన్నారు. నారాయణపూర్‌లో శుక్రవారం ప్రజాప్రతినిధులు, గ్రామస్తులతో సమావేశమయ్యారు. కొంతకాలంగా గ్రామంలో భూసమస్యలపై దరఖాస్తులు వచ్చాయని, వాటి పరిష్కారం కోసం శనివారం అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ గ్రామానికి రానున్నట్లు తెలిపారు. సర్పంచ్ నిమ్మ లక్ష్మి, ఎంపీటీసీ సుల్తానా, వార్డు సభ్యులు మజీద్, కారోబార్ ప్రేమ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మళ్లీ ప్రజల వద్దకే రెవెన్యూశాఖ

వేములవాడరూరల్: గ్రామాల్లో భూసమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం ప్రత్యేకంగా ఇప్పటికే పలు దఫాలుగా రెవెన్యూ సదస్సులు నిర్వహించింది. ఇంకా చాలా గ్రామాల్లో సమస్యలు పరిష్కారం కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం మళ్లీ రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో సదస్సులు నిర్వహించాలని ఆదేశించింది. దీనిలో భాగంగానే శనివారం వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లిలో ఆర్డీవో పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. గ్రామంలోని ఏర్పాట్లను శుక్రవారం ఆర్డీవో పవన్‌కుమార్, తహసీల్దార్ నక్క శ్రీనివాస్ పరిశీలించారు.

రూ.వంద కోట్ల అవినీతిని బయటపెట్టండి

- ఎమ్మెల్యేకు డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ సవాల్
- కబ్జాకు గురైన 140 గుంటల స్థలం పత్రాలు కమిషనర్‌కు అప్పగింత



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

వేములవాడ: వేములవాడలో రూ.వంద కోట్ల అవినీతి జరిగిందని, త్వరలోనే బయటపెడతానంటూ ప్రగల్భాలు పలికిన ఎమ్మెల్యే రమేశ్‌బాబు వాటిని తేల్చకుండానే పరాయి దేశం ఫలాయనమయ్యారని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. వేములవాడలో అన్యాక్రాంతమైన మున్సిపల్‌కు చెందిన 140 గుంటల స్థలం పత్రాలను కమిషనర్ అన్వేశ్‌కు శుక్రవారం అప్పగించారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ నెల రోజుల్లోగా భూకబ్జాల వివరాలు, సెస్‌లో అవినీతిని ఎమ్మెల్యే బయటపెట్టకుంటే కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా చేస్తామని హెచ్చరించారు. అన్యాక్రాంతమవుతున్న రూ.30 కోట్ల విలువైన స్థలాన్ని కాంగ్రెస్ హయాంలో రాజన్న ఆలయం, ఆర్టీసీకి అప్పగించామని గుర్తు చేశారు.

పిల్లల మృతదేహాలకూ పోస్టుమార్టం..?

- మమత శరీరంలో విషముంటే.. శవపరీక్షలు అనివార్యం
- ఎఫ్‌ఎస్‌ఎల్ రిపోర్టు ఆధారంగా పోలీసుల నిర్ణయం
- పక్కపక్కనే అక్కాతమ్ముళ్ల సమాధులు
- పిల్లలను ఖననం చేసి దాదాపు రెండు నెలలు
- గంగాధర మిస్టరీ మరణాల్లో కొత్తకోణం



అద్వైత్, అమూల్య సమాధులు



మమత, శ్రీకాంత్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: సంచలనం సృష్టించిన కరీంనగర్ జిల్లాలోని గంగాధర మిస్టరీ కేసు మరో మలుపు తిరగనుంది. పోలీసులు అనుమానిస్తున్నట్లు ఇంటి పెద్ద వేముల శ్రీకాంత్ తన భార్యాపిల్లలపై విషప్రయోగం చేశాడని నిర్ధారణ అయితే.. పిల్లల మృతదేహాలకూ పోస్టుమార్టం తప్పేలా లేదు. డిసెంబరు 30న అర్ధరాత్రి వేముల శ్రీకాంత్ సోడియం హైడ్రాక్సైడ్ తీసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. ఇదే విషయాన్ని చికిత్స సమయంలో వైద్యులకు చెప్పాడు. ఈ పరిణామంతో పోలీసుల దర్యాప్తు అకస్మాత్తుగా శ్రీకాంత్ వైపు తిరిగింది. శ్రీకాంత్ బయోటెక్నాలజీలో పీజీ చేయడం.. ఫుడ్ సైన్స్ లెక్చరర్ కావడం.. రోజూ ప్రయోగాల కోసం ల్యాబ్‌లో రసాయనాలు వినియోగించడం.. వెరసీ అతనికి కెమికల్స్‌పై పూర్తిస్థాయి అవగాహన ఉందని పోలీసులు నిర్ధరణకు వచ్చారు. ఈ క్రమంలో కుటుంబ సభ్యుల తరహాలోనే తానూ రక్తపువాంతులు, విరోచనాలు చేసుకుని మరణించడంతో వారి శరీరంలోనూ సోడియం హైడ్రాక్సైడ్ చేరిందా..? అనే సందేహాలు పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఫోరెన్సిక్ అధికారులు మమత శరీరంలో ఆర్సెనిక్ ఆనవాళ్లు ఉన్నాయని ప్రాథమికంగా అంచనాకు వచ్చినట్లు సమాచారం. ఈ విషయాన్ని నిర్ధారించుకునేందుకు వారు మరింత లోతుగా రసాయన విశ్లేషణ జరుపుతున్నారు. త్వరలోనే ఈ విషయంపై ఎఫ్‌ఎస్‌ఎల్ తుది నివేదిక పంపితే.. మమత మరణానికి స్పష్టమైన కారణం తెలియనుంది.

45 రోజుల్లో నలుగురు

ఈ ఘటనల్లో తొలుత కుమారుడు అద్వైత్ (20 నెలలు) వాంతులు, విరోచనాలతో అనారోగ్యానికి గురై నవంబరు 16న కన్నుమూశాడు. అవే లక్షణాలతో కూతురు అమూల్య (6) డిసెంబర్ ఒకటిన ప్రాణాలు విడిచింది. ఈ రెండు మరణాలకు వైద్యులు కారణాలు చెప్పలేకపోయారు. అంతుచిక్కని వ్యాధి, కలుషిత తాగునీరు కారణమనుకున్న వైద్యాధికారులు.. సమీపంలోని బావిలోని తాగునీటిని, బాధితుల బంధువులకు రక్తాన్ని పరీక్షించారు. అయినా వారికి ఏమీ చిక్కలేదు. దీంతో మిస్టరీ మరణాలు చేతబడి, మంత్రాల కారణంగా జరుగుతున్నాయన్న ప్రచారం కూడా జరిగింది. శ్రీకాంత్ భార్య మమత (26) కూడా అనారోగ్యానికి గురై డిసెంబరు 18న మరణించింది. డిసెంబరు 30న శ్రీకాంత్ ఆత్మహత్య చేసుకున్నాడు. మొత్తం 45 రోజుల్లో మొత్తం కుటుంబం అనుమానాస్పద స్థితిలో తుడిచిపెట్టుకుపోయింది.

మమత శరీరంలో ఆర్సెనిక్..! మరి పిల్లల్లో..?

పోలీసుల వినతి మేరకు మమత పోస్టుమార్టం సమయంలో వైద్యులు విస్రా (శరీరంలోని కీలక అంతర్భాగాలు)ను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. మమత శరీర భాగాల్లో ఆర్సెనిక్ ఆనవాళ్లను గుర్తించారు. దీన్ని పోలీసులు ఇంకా ధ్రువీకరించాల్సి ఉంది. ఒకవేళ ఇదే నిజమైతే.. వారి శరీరంలోకి ఎలా చేరింది..? పిల్లల మరణాలకు కారణం ఆర్సెనికా..? లేదా సోడియం హైడ్రాక్సైడా..? అనే విషయాన్ని పోలీసులు ధ్రువీకరించుకోవాల్సి ఉంటుంది. పిల్లలిద్దరూ అనారోగ్య లక్షణాలతో మరణించడంతో వారికి పోస్టుమార్టం నిర్వహించలేదు. ఇపుడు వారి మరణంపై అనేక సందేహాలు వెలుగులోకి రావడంతో వారి శవాలకు పోస్టుమార్టం తప్పనిసరి కానుంది. అందుకే పిల్లల శరీర భాగాల నుంచి విస్రా (అంతర్భాగాల నుంచి నమూనాలు)ను తీసుకోవాల్సి ఉంటుంది.

రెండు నెలల అనంతరం..

నవంబరు 16న 20 నెలల అద్వైత్ అనుమానాస్పదంగా మరణించాడు. అతడిని గంగాధర శివారులోని వంతెన సమీపంలో ఖననం చేశారు. డిసెంబరు ఒకటిన అమూల్య (6) కూడా కన్నుమూసింది. దీంతో తమ్ముడి సమాధి పక్కనే అక్కనూ ఖననం చేశారు. వీరిలో అద్వైత్ మరణించి 50 రోజులు, అమూల్య చనిపోయి 35 రోజులు దాటింది. ఎఫ్‌ఎస్‌ఎల్ రిపోర్టు రావడానికి వారం పట్టవచ్చని పోలీసులు అంటున్నారు. ఒకవేళ మమత శరీరంలో విష ఆనవాళ్లు ఉంటే పిల్లల మరణాలకు కారణం తెలుసుకోవాల్సి ఉంటుంది. అదే నిజమైతే.. పిల్లలు మరణించిన దాదాపు రెండు నెలల అనంతరం పోస్టుమార్టం చేయాల్సి వస్తుందని పలువురు సీనియర్ పోలీసు అధికారులు అభిప్రాయపడుతున్నారు.

క్లుప్తంగా


విద్యారంగంలో జగిత్యాలను అగ్రగామిగా నిలపాలి


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రవి

జగిత్యాల: విద్యారంగంలో జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ రవి అన్నారు. శుక్రవారం ఎస్టీయూ రూపొందించిన నూతన క్యాలెండర్‌ను ఆయన జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ, పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని, గుణాత్మకమైన ఫలితాల కోసం ప్రతీ ఉపాధ్యాయుడు కృషి చేయాలని సూచించారు. మన ఊరు.. మన బడి పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వసతులు కల్పించేందుకు కృషి చేస్తోందని అన్నారు. ఖాళీగా ఉన్న సబ్జెక్ట్‌ల స్థానాల్లో వెంటనే విద్యావలంటీర్లను నియమించుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బైరం హరికిరణ్, మచ్చ శంకర్, మేకల ప్రవీణ్, గంప కిరణ్, రాజేశ్, రామకృష్ణ, కృష్ణ, వెంకటేశ్, రాజ్‌కిరణ్, దశరథరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'గుండెలో వాన'కు పీచర సునీతారావు పురస్కారం




అశోక్‌కుమార్, కథా రచయిత

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ప్రముఖ కథకుడు, నవలా రచయిత పెద్దింటి అశోక్‌కుమార్ రాసిన 'గుండెలో వాన' కథా సంపుటి మరో సాహిత్య పురస్కారానికి ఎంపికైంది. హైదరాబాద్ రవీంద్రభారతి మినీహాల్‌లో ఆదివారం పీచర సునీతారావు స్మారక సాహిత్య పురస్కారం అందించనున్నారని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. తనతోపాటు కవిత్వంలో వెల్దండి శ్రీధర్, విమర్శలో వెలదండ నిత్యానందరావులు కూడా ప్రముఖ కవి, గాయకుడు దేశపతి శ్రీనివాస్, ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి చేతులమీదుగా ఈ అవార్డు అందుకోనున్నారని పేర్కొన్నారు. గుండెలో వాన కథల పుస్తకానికి గతంలో ఆంధ్ర సారస్వత పరిషత్ సాహిత్య పురస్కారం, మరో రెండు అవార్డులు దక్కాయి.


సౌత్‌జోన్ స్థాయి పోటీలకు ఎంపిక


రాహుల్

జగిత్యాల: స్థానిక ఎస్కేఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో చదువుకుంటున్న సీహెచ్. రాహుల్ శాతవాహన యూనివర్సిటీ తరఫున సౌత్‌జోన్ ఖో ఖో పోటీల కు ఎంపికయ్యాడు. ఈనెల 9 – 12 వరకు ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జేఎ న్‌టీయూ నిర్వహించనున్న పోటీల్లో పాల్గొనున్నారు. ఈ సందర్భంగా ఎస్కేఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ అరిగెల అశోక్, వైస్ ప్రిన్సిపల్ కరుణాకర్, పీడీ రవికుమార్ విద్యార్థిని అభినందించారు.

రెండో బ్రిడ్జి పూర్తయ్యేదెప్పుడో?

- ఇప్పటికే రెండుసార్లు కూలిన వైనం
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- సమీపిస్తున్న మహాశివరాత్రి జాతర
- ట్రాఫిక్ తిప్పలు తప్పేదెప్పుడో?


మూలవాగుపై నిలిచిన రెండో బ్రిడ్జి పనులు

వేములవాడ: ఆధ్యాత్మిక క్షేత్రం వేములవాడ రాజన్న ను దర్శించుకునేందుకు వచ్చే భక్తులు, స్థానికులతో పట్టణంలో తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. తిప్పాపూర్ నుంచి వేములవాడకు వచ్చేందుకు పాత వంతెనతోపాటు నూతనంగా మరో వంతెన నిర్మించారు. అయితే వంతెనలపై ఆది, సోమవారా లలో తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. ఇక పండుగ రోజులు, మహాశివరాత్రి జాతర రోజుల్లో ఈ సమస్య మరింత తీవ్రమవుతుంది. భక్తుల కష్టాలను పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మొదలు పెట్టిన రెండో నూతన వంతెన ఐదేళ్లుగా పూర్తి కావ డం లేదు. ఇప్పటికే వరుసగా రెండు వర్షాకాలాలో రెండు సార్లు వరద తాకిడికి కొట్టుకుపోయింది. రానున్న మహాశివరాత్రి జాతర వరకైన పూర్తి చేస్తారా?లేదా? అని స్థానికులు చర్చించుకుంటున్నారు.

2016లో శంకుస్థాపన

వేములవాడలో ట్రాఫిక్ కష్టాలను దూరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మానేరువాగుపై వంతెన నిర్మించాలని నిర్ణయించింది. ఈమేరకు 2016లో అప్పటి ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా రూ.28 కోట్లతో మూలవాగుపై రెండు వంతెనలు నిర్మించాలని నిర్ణయించింది. ఈమేరకు పనులకు శంకుస్థాపన చేశారు. ఇందులో రెండు బ్రిడ్జీల నిర్మాణాల కోసం రూ.13 కోట్లు, మిగతా నిధులు భూసేకరణకు కేటాయించారు. మొదటి ఫోర్‌లేన్ వంతెన నిర్మాణం పూర్తి కాగా, రెండో వంతెన పనులు ఏడేళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. ఈక్రమంలోనే రెండు పర్యాయాలు వరద తాకిడికి రెండో వంతెన కొట్టుకుపోయింది.

రెజ్యూమ్‌తో రెండో బ్రిడ్జి పనులు షురూ

వేములవాడ మూలవాగుపై నిర్మాణంలో ఉన్న రెండో బ్రిడ్జి రెండుసార్లు వరద తాకిడికి కూలిపోయిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని ప్రభుత్వం సీరి యస్‌గా తీసుకోవడంతో రూ.28 కోట్లతో కాంట్రాక్టర్‌కు రెజ్యూమ్ చేస్తూ పనులు చేయాలని ఆదేశించింది. దీంతో కొద్ది రోజులుగా పనులు పునర్ ప్రారంభమైనప్పటికీ పూర్తికావడం లేదు. బ్రిడ్జి నిర్మా ణం పనులు పూర్తయితే ట్రాఫిక్ సమస్య తీరనుంద ని రాజన్న భక్తులు, స్థానికులు సంబరపడిపోతున్నారు.

ఏడేళ్లుగా నత్తనడకన

ఏడేళ్లుగా సాగుతున్న ఈ బ్రిడ్జి పనులు ఇంకా కొనసా...గుతూనే ఉన్నాయి. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా లక్షలాది మంది భక్తులు వేములవాడకు తరలివస్తారని భావించిన అప్పటి కలెక్టర్ వెంకట్రామిరెడ్డి అధికారులపై ఒత్తిడి తేవడంతో జాతరకు ముందుగానే మొదటి బ్రిడ్జి పనులు పూర్తి చేశారు. ఈక్రమంలో రెండో వంతెన పనులు కొనసాగుతుండటంతో వరదనీటి ప్రవాహానికి కూలిపోయింది. తర్వాత ఏడాదిలో వచ్చిన వరదలకు రెండోసారి సైతం వంతెన కొట్టుకుపోయింది.

పనులు ప్రారంభమయ్యాయి

మూలవాగుపై రెండో బ్రిడ్జి పనుల గురించి మంత్రితో చర్చించి, కాంట్రాక్టర్‌తో ఒప్పించి రీ షెడ్యూల్ చేశాం. బ్రిడ్జి పనులు తిరిగి ప్రారంభించాం. త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించాం. బ్రిడ్జి పూర్తయితే ట్రాఫిక్ సమస్య తీరడంతోపాటు వేములవాడకు అదనపు శోభ సంతరించుకోనుంది. మహాశివరాత్రి జాతరలోగా పూర్తి చేయాలని సూచించాం.

– రమేశ్‌బాబు, వేములవాడ ఎమ్మెల్యే

నాణ్యత లోపిస్తే చర్యలు

మూలవాగులో నిర్మాణంలో ఉన్న రెండో బ్రిడ్జి రెండుసార్లు కూలిపోయింది. దీంతో రెజ్యూమ్ చేసి తిరిగి అదే కాంట్రాక్టర్ ద్వారా అదే అగ్రిమెంట్‌పై పనులు చేయిస్తున్నాం. త్వరగా పూర్తి చేయాలని ఆదేశించాం. పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటాం. మార్చి నాటికి పూర్తి చేయిస్తాం.

– సతీశ్, ఏఈ, ఆర్‌అండ్‌బీ

కేసులు పెట్టినా.. దీక్ష విరమించేది లేదు

- మురికి కాలువలు నిర్మించాల్సిందేనన్న వెంటాపూర్‌వాసులు
- పోలీసులతో వాగ్వాదం


పోలీసులతో గ్రామస్తుల వాగ్వాదం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని వెంకటాపూర్‌లో మురికి కాలువలు నిర్మించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష రెండో రోజు శుక్రవారం కొనసాగింది. శిబిరం వద్దకు సీఐ మొగిలి ఆధ్వర్యంలో పోలీసులు వచ్చి, దీక్ష విరమించాలని, లేదంటే అందరిపై కేసులు నమోదు చేసి, అరెస్టు చేస్తామని చెప్పడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఎన్ని కేసులు పెట్టినా సమస్య పరిష్కారమయ్యే వరకు ఆందోళన విరమించేది లేదని తేల్చిచెప్పారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన బీజేపీ మండల అధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి పోలీసుల తీరుపై మండిపడ్డారు. సమస్య పరిష్కారం కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న గ్రామస్తులను కేసులు పెడతామని, అరెస్టు చేస్తామని బెదిరించడం సరికాదన్నారు. అదే జరిగితే గ్రామస్తులందరితో కలిసి ఠాణా ఎదుట ఆందోళన చేస్తామని పేర్కొన్నారు. ఉపసర్పంచ్ మేడిశెట్టి బాలయ్య, వార్డు సభ్యులు గడ్డం రవి, గుర్రాల రాజిరెడ్డి, పూర్ణ చందర్, బీజేవైఎం జిల్లా కోశాధికారి మహేశ్, బూత్ అధ్యక్షుడు రమేశ్ తదితరులున్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న మాణిక్‌రెడ్డి

మల్లాపూర్(కోరుట్ల): స్త్రీనిధి రుణాలను మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని సెర్ప్ ప్రాజెక్ట్ మేనేజర్ మాణిక్‌రెడ్డి కోరారు. స్థానిక ఐకేపీ(సెర్ప్) కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన వీవోఏల ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. వారికి చేయూత ఇచ్చేందుకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. బ్యాంకు లింకేజీ లక్ష్యానికి అనుగుణంగా స్వశక్తి సంఘాలకు రుణాలు మంజూరు చేశామని ఆయన వివరించారు. వీవోఏల వారీగా ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బ్యాంక్ లింకేజీ లక్ష్యంపై సమీక్ష నిర్వహించి నెలాఖరులోగా పూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం రాజేశ్, డీఎంజీ మెట్టు దాస్, సీసీలు రమేశ్, లక్ష్మీరాజం, రాజు, స్రవంతి, మండల సమాఖ్య అధ్యక్షురాలు మారు ప్రమీల, వీవోఏలు, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

జాబ్ కొట్టడమే లక్ష్యంగా సిద్ధమవ్వండి


అభ్యర్థులతో మాట్లాడుతున్న ఎంపీపీ శరత్‌రావు

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్‌లో కేటీఆర్ ఉచిత కోచి ంగ్ సెంటర్ నుంచి ఎస్సై, కానిస్టేబల్ మెయిన్స్ అర్హత సాధించిన అభ్యర్థులకు శుక్రవారం దిశానిర్దేశం చేశారు. ప్రిలిమ్స్ నుంచి ఈవెంట్స్ వరకు 120 మంది యువతీయువకులకు ఎంపీపీ శరత్‌రావు ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ ఇప్పించారు. ఇందులో 30 మంది ఈవెంట్స్‌లో అర్హత సాధించారు. వంద రోజులలో ఎస్సై, కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షలు ఉన్నాయని, అత్యుత్తమ ఫ్యాకల్టీతో కోచింగ్ ఇప్పిస్తామన్నారు. జాబ్ కొట్టడమే లక్ష్యంగా సిద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గుండం నర్సయ్య, హెడ్ కానిస్టేబుల్ గంగయ్య, కుమార్, రవి, రాజశేఖర్, ఖాసీం ఉన్నారు.

ప్రతీ మండలానికి ఫైర్‌స్టేషన్

- వేములవాడ పట్టణానికి డబుల్ యూనిట్
- డివిజనల్ అధికారి వెంకన్న


ఆపద సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై వివరిస్తున్న అధికారి వెంకన్న

వేములవాడరూరల్: ప్రతి మండలంలో ఫైర్ స్టేషన్ ఉండాలనేది ప్రభుత్వ లక్ష్యమని డివిజనల్ అగ్నిమాపక అధికారి వెంకన్న పేర్కొన్నారు. వేములవాడ ఫైర్‌స్టేషన్‌ను శుక్రవారం తనిఖీ చేసిన సందర్భంగా మాట్లాడారు. పరికరాలు, వాటి వినియోగంపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆపద సమయంలో ఆదుకోవాల్సిన ఫైర్ సిబ్బంది తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. ప్రతి నియోజకవర్గంలో ఫైర్‌స్టేషన్ ఉన్నదని, ఇంకా కొన్ని ఫైర్ స్టేషన్‌లను కొత్తగా ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వేములవాడలో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటున్నందున మరో యూనిట్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్లు తెలిపారు. స్టేషన్ ఫైర్ ఆఫీసర్ టి.కమలాకర్, బి.రాజేంద్రప్రసాద్, కె.మునీంద్రాచారి, సీహెచ్ శంకర్, రాజేశ్వర్, రాజేశం ఉన్నారు.

స్వగ్రామానికి మంజుల మృతదేహం

- అంత్యక్రియలు పూర్తి


మంజుల మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు, బంధువులు


మంజుల (ఫైల్)

రుద్రంగి(వేములవాడ): మండలంలోని సర్పంచ్ తండాకు చెందిన మాలోతు మంజుల కుటుంబ కలహాలతో గురువారం రాత్రి హైదరాబాద్‌లో ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. ఆమె మృతదేహం శుక్రవారం ఉదయం స్వగ్రామం చేరింది. మృతురాలి కుటుంబసభ్యులు, బంధువులు ఆమెను విగతజీవిగా చూసి, కన్నీరుమున్నీరుగా విలపించారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. మంజుల మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం 14 నెలల బాబుకు తల్లిని లేకుండా చేసిందని స్థానికులు కంటతడి పెట్టారు.

పొలంలోకి దూసుకెళ్లి కారు బోల్తా


పొలంలో బోల్తా పడిన కారు

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని తడగొండ గ్రామం నుంచి మల్కాపూర్ వెళ్లే దారిలో ఓ కారు అదుపుతప్పి, పొలంలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాపూర్‌లోని ఓ ఇంట్లో ఫంక్షన్‌కు వచ్చిన ఓ వ్యక్తి గురువారం అర్ధరాత్రి కారులో తడగొండ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో వాహనం అదుపుతప్పి, రోడ్డు పక్కనే ఉన్న పొలంలోకి దూసుకెళ్లి, బోల్తా పడింది. ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదని తెలిసింది. శుక్రవారం ఉదయం సంబంధిత వ్యక్తులు వచ్చి, జేసీబీ సాయంతో కారును తీసుకెళ్లినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

రాజన్న సేవలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే


ఎమ్మెల్యే గణేశ్ గుప్తాను సన్మానిస్తున్న పర్యవేక్షకుడు శంకర్

వేములవాడ: నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా శుక్రవారం వేములవాడ రాజన్నను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి, ప్రత్యేక దర్శన అవకాశం కల్పించారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో వేదోక్త ఆశీర్వచనం గావించారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు అల్లి శంకర్, శ్రీరాములు, ఆలయ ఇన్‌స్పెక్టర్ సంకెపల్లి పవన్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం నాయకులు కట్కూరి శ్రీనివాస్, తాటికొండ పవన్‌కుమార్, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమించి పెళ్లి చేసుకుంటే..
పోలీసులు వేధిస్తున్నారు

- ఇద్దరు అధికార పార్టీ నేతల ఒత్తిడే కారణం
- సిరిసిల్లలో బోరుమన్న బొప్పాపూర్ యువకుడు


సిరిసిల్లలో పెళ్లి ఫొటో, పోలీసులు పగులగొట్టిన సెల్‌ఫోన్‌ను చూపుతున్న బాలకిషన్

సిరిసిల్ల: ప్రేమించి పెళ్లి చేసుకుంటే పోలీసులే తమను విడదీసి, విడాకులు ఇవ్వాలని వేధిస్తున్నారని ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌కు చెందిన యువకుడు లంబ బాలకిషన్ శుక్రవారం కన్నీటి పర్యంతమయ్యాడు. ఎల్లారెడ్డిపేట పోలీసుల వేధింపులను భరించలేకపోతున్నానని, తనకు చావే శరణమని ఆవేదన వ్యక్తం చేశారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం బాధితుడు లంబ బాలకిషన్(26) విలేకరుల సమావేశంలో తన ప్రేమకథను వివరించారు. రాచర్ల బొప్పాపూర్‌కు చెందిన తాను.. తన ఇంటి ముందుండే 20 ఏళ్ల యువతిని ప్రేమించానని, 2021 డిసెంబరు 14న ఆర్యసమాజ్‌లో పెళ్లి చేసుకున్నామని వివరించారు. అదే రోజు ఎల్లారెడ్డిపేట పోలీసులను ఆశ్రయించగా ఇరువర్గాల పెద్దలకు కౌన్సెలింగ్ చేసి పంపించారని వివరించారు. అదే రోజు వేములవాడకు వెళ్లి ఆశ్రయం పొందినట్లు తెలిపారు. అమ్మాయి తండ్రి, బంధువులు తాము ఆశ్రయం పొందిన ఇంటికి రాగా.. డయల్ 100కు కాల్‌చేసి పోలీసుల రక్షణ కోరినట్లు వివరించారు. అమ్మాయి కుటుంబ సభ్యులు ధనబలంతో, అధికార పార్టీ నేతల అండతో అమ్మాయిని బలవంతంగా తీసుకెళ్లారని, తనపై వరకట్నం వేధింపుల కేసు పెట్టారని వాపోయాడు. దీనిపై తాను హైకోర్టులో కేసు వేశానని, ఆ కేసు విచారణలో ఉండగానే ఎల్లారెడ్డిపేట పోలీసులు వేధిస్తున్నారని కన్నీటి పర్యంతమయ్యాడు.

పోలీసులు బెదిరిస్తున్నారు

ఎల్లారెడ్డిపేట సీఐ మొగిలి, ఎస్సై శేఖర్ తనను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి అమ్మాయికి విడాకులు ఇవ్వాలని, లేకుంటే కేసులు పెట్టి జైలుకు పంపుతామని బెదిరిస్తున్నారని బాలకిషన్ ఆరోపించారు. తాను వ్యవసాయం చేసుకుంటూ.. సాధారణ జీవితం గడుపుతున్నానని, న్యాయస్థానంపై నమ్మకంతో ఉన్నానని వివరించారు. ఎస్సై సూచన మేరకు కానిస్టేబుల్ ఒకరు నా సెల్‌ఫోన్ తీసుకుని పాస్‌వర్డ్ చెప్పాలని వేధించాడని, తాను చెప్పకపోవడంతో ఐ–ఫోన్‌ను నేలకేసి కొట్టడంతో పగిలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. పోలీసుల వేధింపులతో తనకు చావే శరణ్యమని, అధికార పార్టీ నేతలు ఇద్దరు పోలీసులతో ఒత్తిడి చేయిస్తున్నారని ఆరోపించారు. తనపై కేసులు కోర్టు విచారణలో ఉండగా.. పోలీసులు వేధించడం ఏమిటని బాలకిషన్ ప్రశ్నించాడు. తనపై తప్పుడు కేసులు పెడతామని, లాకప్పులో వేస్తామని పోలీసులు వేధిస్తున్నారని వివరించారు. అగ్రకుల అమ్మాయిని ప్రేమించిన పాపానికి పోలీసులే మమ్మల్ని వేరు చేసి.. ఇప్పుడు వేధిస్తున్నారన్నారు.

మా విచారణకు సహకరించడం లేదు

బాలకిషన్ పెళ్లి చేసుకున్న ఫొటోలను, ఆ అమ్మాయితో ఉన్న ఫొటోలను సోషల్‌మీడియాలో పెడుతున్నాడు. అమ్మాయి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో అతనిని పిలిచి విచారించాం. మా విచారణకు సహకరించడం లేదు. అతనిపై ఓ కేసు కూడా నమోదైంది. మేం అతనిని వేధించలేదు. విచారణకు సహకరిస్తే నోటీస్ ఇస్తాం. లేకుంటే రిమాండ్ చేస్తాం.

– మొగిలి, ఎల్లారెడ్డిపేట సీఐ

ఆశ్రమానికి రూ.10 లక్షలు కేటాయింపు


ఎమ్మెల్యే రవిశంకర్‌తో నాయకులు

జగిత్యాల: జగిత్యాల వెల్మ సంక్షేమ మండలి వృద్ధాశ్రమానికి చొప్పదండి ఎమ్మెల్యే రవిశంకర్ రూ.10 లక్షలు కేటాయించారు. నూకపల్లి అర్బన్ కాలనీలో నిర్మిస్తున్న ఈ ఆశ్రమానికి నిధులు కేటాయించడంపై వెల్మ సంక్షేమ మండలి నాయకులు శుక్రవారం ఆయనను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వెల్మ సంక్షేమ సంఘం నాయకులు వేణుగోపాల్‌రావు, రాంమోహన్‌రావు, కృష్ణారావు, సాగర్‌రావు, రాజనర్సింగరావు, సత్యనారాయణరావు పాల్గొన్నారు.

క్రీడాప్రాంగణాల పనులు వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న అదనపు డీఆర్డీవో శివాజీ

రాయికల్(జగిత్యాల): గ్రామాల్లో చేపట్టిన క్రీడాప్రాంగణాల పనులను వేగవంతం చేయాలని అదనపు డీఆర్డీవో శివాజీ సూచించారు. శుక్రవారం ఉప్పుమడుగు, అల్లీపూర్, సింగరావుపేట, కిష్టంపేట గ్రామాల్లో చేపట్టిన క్రీడాప్రాంగణాల పనులనులాయన పరిశీలించారు. పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట పలువురు అధికారులు, నాయకులు తదితరులున్నారు.

రాజన్న సన్నిధిలో శివదీక్షలు ప్రారంభం


శివదీక్ష తీసుకున్న భక్తులు

వేములవాడ: రాజన్న సన్నిధిలో మండల శివదీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఓ నమఃశివాయ ఉచ్చరణతో ఆలయ ప్రాంతం మార్మోగింది. అర్చకుడు నందగిరి శంకరయ్య, గురుస్వాములు వాసాల మర్రి గోపి, తుమ్మల సంతోష్‌ల ఆధ్వర్యంలో 300 మంది దీక్ష తీసుకున్నారు. గత 32 ఏళ్లుగా వేములవాడలో శివదీక్షలు కొనసాగుతున్నట్లు అర్చకులు తెలిపారు. అర్ధ మండల శివదీక్షలు ఈ నెల 26 నుంచి ప్రారంభమవుతాయని, శివదీక్షా విరమణ మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఫిబ్రవరి 18నభీమేశ్వరాలయంలో ఉంటుందని పేర్కొన్నారు.

ఆరుద్ర నక్షత్రోత్సవం

ఆరుద్ర నక్షోత్సవాన్ని పురస్కరించుకొని వేములవాడ రాజన్నకు శుక్రవారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, స్వామివారిని దర్శించుకున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా?

- బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి ముదుగంటి రవీందర్‌రెడ్డి



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

జగిత్యాలటౌన్: ఇరుకైన యావర్‌రోడ్డులో అనేక ప్రమాదాలు జరుగుతూ ప్రాణాలు పోతున్నా పట్టించుకోవడం లేదని, విస్తరణ అంశం ఎన్నికల హామీగా మారిపోయిందని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముదుగంటి రవీందర్‌రెడ్డి అన్నారు. యావర్‌రోడ్డు విస్తరణ చేపట్టి ప్రమాదాలు నివారించాలని కోరుతూ శుక్రవారం భారతీయ జనతాపార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ 2018ఎన్నికల సందర్భంగా యావర్‌రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చి గెలిచిన ఎమ్మెల్యే.. ఇప్పుడు ముఖం చాటేస్తున్నారని విమర్శించారు. కేవలం ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నచోటే తూతూ మంత్రంగా విస్తరణ చేపట్టి చేతులు దులుపుకున్నారని ధ్వజమెత్తారు. పాత బస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్ వరకు ఇరువైపులా రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. రోడ్డు విస్తరణతో ఆస్తులు కోల్పోయిన వారికి తగిన పరిహారం లేదా స్థలానికి బదులు స్థలం కేటాయించాలని కోరారు. కొత్త బస్టాండ్ వద్ద అడ్డుగా ఉన్న జనరేటర్ రూం తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గుర్రం రాము, నాయకులు ఏపీఎస్ రాజు, అక్కినపెల్లి కాశీనాథం, చీటి శేఖర్‌రావు, లక్ష్మారెడ్డి, మాడిశెట్టి మల్లేశం, బిట్టు, జ్ఞానేశ్వర్, బిక్షపతి తదితరులు ఉన్నారు.

వానరానికి అంత్యక్రియలు


అంత్యక్రియలు నిర్వహిస్తున్న సంతోష్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ సమీపంలో గురువారం వాహనం ఢీకొని, ఓ వానరం తీవ్రంగా గాయపడింది. ఎంపీటీసీ సభ్యుడు బైరినేని రాము, బీజేపీ సీనియర్ నాయకుడు గజభీంకార్ సంతోష్ వెటర్నరీ ఆసుపత్రికి తరలించి, చికిత్స చేయించారు. అయితే ఆ వానరం శుక్రవారం చనిపోయింది. సురేష్ స్పందించి, మానేరు వాగుకు తరలించి, అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో నేరెళ్ల హరీశ్, గుంజె రంగనాథ్, దేవరాజు పాల్గొన్నారు.